సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విజయ గణపతి ఆలయంలో విశేష హోమం



విశేష అలంకరణలో స్వామి

మధురవాడ: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మధురవాడ గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో బుధవారం విశేష హోమం నిర్వహించారు. స్వామి వారికి వేకువజాము నుంచి పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకములు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో హోమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ సమన్వయ కమిటీ పర్యవేక్షించింది.

డిగ్రీ కళాశాలకు అధ్యాపకురాలి వితరణ



ప్రిన్సిపాల్‌కు బీరువా తాళాలు అందిస్తున్న లెక్చరర్ స్వర్ణలత

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఫిజిక్స్ అధ్యాపకురాలు బి.స్వర్ణలత బుధవారం గోద్రెజ్ బీరువా బహూకరించారు. కళాశాలకు సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్ భద్రపరచుకునేందుకు వినియోగించాలని ఆమె ప్రిన్సిపాల్ శ్రీవాణిని కోరారు. కళాశాల అవసరాలను గుర్తించి, బీరువా అందించిన అధ్యాపకురాలిని ప్రిన్సిపాల్ అభినందించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: బ్యాంక్ ఆఫ్ బరోడా సిరిపురం శాఖ ఆధ్వర్యంలో జాలరి ఎండాడ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు అందించారు. సీఎస్‌ఆర్ నిధుల నుంచి అందజేసిన కిట్లను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పిల్లలకు అందజేశారు. బ్యాంకు యాజమాన్యానికి ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సురేష్ కుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యవాణి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడి అదృశ్యం



నరసింహ

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు నమ్మివానిపేటకు చెందిన రిక్షా కార్మికుడు నరసింహ(72) ఆగస్టు 10నుంచి కనిపించడం లేదు. పూర్వం నుంచి నమ్మివానిపేటలో ఉంటున్న వీరి కుటుంబం గత నెల 6న భీమిలి మండలం తాటితూరుకు వెళ్లిపోగా, నరసింహ మాత్రం నమ్మివానిపేటలోనే ఉండిపోయాడు. అదే నెల 9న నరసింహ తాటితూరు వెళ్లగా 10వ తేదీ ఉదయం కుమారుడు వెంకటరావు తండ్రిని పాత ఆంధ్రా బ్యాంక్ వద్ద వదిలి వెళ్లాడు. తిరిగి 11న నమ్మివానిపేట వెళ్లి చూడగా తండ్రి కనిపించలేదు. రిక్షా మాత్రమే ఉంది. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాలలో వెదికినా కనిపించకపోవడంతో భీమిలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెచ్చులు ఊడుతున్నాయ్..



పెచ్చులూడుతున్న శ్లాబ్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని ప్రాథమిక పాఠశాల శ్లాబ్ పెచ్చులూడి పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ఏ సమయంలో ఏ ప్రమాదం వస్తుందో అని హడలిపోతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు
- మాయమైపోతున్న హెచ్చరిక బోర్డులు
- క్రమబద్ధీకరణ పేరుతో ఆక్రమణ
- కాపులదిబ్బడపాలెంలో జోరుగా అమ్మకాలు

బీచ్ రోడ్డులో భూ మాయాజాలం



రాజీవ్‌నగర్‌లో హెచ్చరిక బోర్డు తొలగించిన ప్రభుత్వ స్థలం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువవుతోంది. విశాఖ–భీమిలి రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం దొరకాలన్నా, కొనాలన్నా ప్రస్తుతం సాధ్యం కాని పని. సెంటు స్థలం లక్షల్లో ఉంది. పోనీ ఏదో విధంగా కొందామన్నా ఈ ప్రాంతాల్లో స్థలం దొరకని పరిస్థితి. దీంతో బడాబాబుల కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. ఇంకేముంది? చోటా, బేటా నాయకులను పట్టుకుని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి క్రమబద్ధీకరణ పేరుతో పట్టాలు పుట్టించేందుకు అనేక చోట్ల ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టకపోతే కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉంది.



నరసింహానగర్ వద్ద ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో తొలగించిన హెచ్చరిక బోర్డు

బీచ్ రోడ్డులో హెచ్చరిక బోర్డు మాయం

విశాఖ భీమిలి బీచ్ రోడ్డు మార్గ మధ్యలో సాగరానికి అభిముఖంగా విలువైన ప్రభుత్వ స్థలం ఒకటి ఉంది. రామాద్రి సమీపంలో 314 సర్వే నెంబరులోని 73 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు స్థానిక నాయకులు గతంలో ప్రయత్నించారు. పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే, కోట్ల రూపాయల విలువైన ఆ స్థలంలో హెచ్చరికబోర్డు మాయమైంది. స్థలాన్ని అమ్మేందుకు బేరసారాలు కూడా జరుగుతున్నాయి.

- కె.నగరపాలెం పరిధి కాపులుప్పాడ రెవెన్యూ నరసింహానగర్‌లో ఇటీవల అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు మాయం చేసేశారు. ప్రస్తుతం అక్కడ కమర్షియల్ నిర్మాణాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ స్థలాన్ని ఎలా అయినా చేజిక్కించుకోవాలని స్థానిక నాయకుడు రెవెన్యూ అధికారులతో పైరవీలు చేస్తున్నారు.
- తిమ్మాపురంలోని ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు మాయమైపోతున్నాయి. ఈ ప్రాంతంపైనా కూడా ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

60 గజాల స్థలం రూ. 6లక్షలకు..

4వ వార్డు కె.నగరపాలెం సచివాలయం సమీపంలో ప్రభుత్వ స్థలాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ కాపులదిబ్బడపాలెంలో 314 సర్వే నెంబరులో 60 గజాల ప్రభుత్వ స్థలాన్ని రూ. 6 లక్షలకు బహిరంగంగానే అమ్ముతున్నారు. అంతేకాదు, ఇక్కడ గ్రామ పెద్దలకు మరో రూ. 50వేలు అదనంగా ఇస్తున్నారని.. ఆ డబ్బును అధికారులను మేనేజ్ చేయడానికి తీసుకుంటున్నట్లు సమాచారం.

రాజీవ్‌నగర్‌లో:

జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి రాజీవ్‌నగర్ కొండపై ఆక్రమణల జోరు బహిరంగంగానే సాగుతోంది. స్థానిక నాయకుల సహకారంతో 60 గజాల స్థలాలు చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. దీనిపై గతంలో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే నేడు అవి కనిపించకుండా పోతున్నాయి. హెచ్చరిక బోర్డులు తీసేసి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రశ్నించిన అధికారులపై దాడికి యత్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటిని కట్టడి చేయాలంటే ఉన్నత అధికారుల పర్యవేక్షణలో పోలీసులు రక్షణ ఏర్పాటు చేసి స్థలాలను పరిశీలించి, ఆక్రమణలు తొలగించాలి. కానీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంతో ఆక్రమణలు మరల జోరందుకున్నాయి.

క్రమబద్ధీకరణ పేరుతో సొంతం చేసుకునేందుకు..

సాగర్‌నగర్ బీచ్ రోడ్డుకు ఆనుకుని 106 సర్వే నెంబరులో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఒక వ్యక్తి భారీ స్కెచ్ వేశాడు. పునాదులు నిర్మించి క్రమబద్ధీకరణ చేసి పట్టాలు పొందేందుకు రెవెన్యూ అధికారులతో పైరవీలు చేస్తున్నారు. విశాఖ భీమిలి బీచ్ రోడ్డు ఆనుకుని ఉన్న సుమారు 500 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కొంతమేర క్రమబద్ధీకరణ పేరుతో ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుండగా మరికొంత స్థలాన్ని నకిలీ పత్రాలతో ఆక్రమించేందుకు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ప్రయత్నం చేస్తున్నారు. ఒక సర్వేయర్ సహకారంతో సర్వే నెంబరు మార్పు చేసి స్థలాన్ని ఆక్రమించేందుకు పెద్దగానే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి ఈ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



సాగర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బేస్‌మెంట్

రోడ్డైతే తవ్వి నిర్మాణం



రోడ్డు తవ్వి నిర్మాణం చేపడుతున్నారిలా..

4వ వార్డు గోవుపేటలో ఓ వ్యక్తి ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును 80 శాతం తవ్వి పునాదులు నిర్మించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. రూ. 40 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ ప్రాంతానికి రోడ్డు నిర్మించారు. అయితే ఇక్కడ కొందరు స్థానికుల సహకారంతో రోడ్డును ఇష్టం వచ్చినట్లు తవ్వి పునాదులు వేసి ఆక్రమించుకున్నాడు. ఇదంతా అధికారులకు తెలిసినా మౌనం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ స్థలం ఆక్రమించడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులను కూడా ధ్వంసం చేయడం విస్మయానికి గురి చేస్తోంది.

సమగ్ర విచారణ చేస్తాం

ప్రభుత్వ స్థలాన్ని ఒక్క అడుగు ఆక్రమించినా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం ఎన్నో ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీచ్ రోడ్డులో ఆక్రమణలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారు ఎంతటి వారైనా క్షమించేది లేదు.

– సంగీత్ మాథూర్, ఆర్డీవో

400 గజాలు ఒక వ్యక్తికే..

కె.నగరపాలెం సచివాలయం పరిధిలో కాపులుప్పాడ రెవెన్యూ 314 సర్వే నెంబరు ఎస్సీ కాలనీలో కె.నగరపాలెంకు చెందిన ఓ వ్యక్తి సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో ఆక్రమించి పునాదులు వేశాడు. అయితే ఆక్రమణను అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇటీవల రాత్రికి రాత్రే చుట్టూ గోడలు కట్టి సుమారు రూ. కోటి 20 లక్షలు విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. ఎవరైనా అధికారులు వచ్చి ప్రశ్నిస్తే, స్థలం తనదే అని ట్యాక్సులు ఉన్నాయని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో చెప్పిస్తామని రుబాబు చేస్తున్నాడు.



కాపులదిబ్బడపాలెంలో ఆక్రమించేందుకు చదును చేసిన ప్రభుత్వ స్థలం

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను వినియోగించుకోవాలి

పద్మనాభం: ఎస్‌బీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్ కోరారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై రేవిడిలోని రెడ్డిపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవన జ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈకేవైసీ, సైబర్ క్రైమ్‌లపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ ఎస్, ఆర్ఎం అభిషేక్ కుమార్, రెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆవాల గంగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్

సెల్‌టవర్ ఏర్పాటుపై ఆందోళన

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం భాస్కర్‌నగర్‌లో సెల్ టవర్, గ్యాస్ గొడౌన్ ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మధురవాడలోని జీవీఎంసీ జోన్–2 ఆఫీసు వద్ద మధువన అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయమని ఫిర్యాదులిచ్చినా పట్టించుకోని అధికారులు, సెల్ టవర్ కోసం క్షణాల్లో వేసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్‌టవర్ రేడియేషన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నివాసాలకు చేరువలోనే గ్యాస్ గొడౌన్ కూడా ఏర్పాటు చేస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రేవళ్లపాలెం వాసులు

ప్రత్యేక అలంకరణలు..అన్న సమారాధనలు

తగరపువలస: గణపతి ఉత్సవాలలో భాగంగా భీమిలి, ఆనందపురం మండలాల్లో పలుచోట్ల బుధవారం అన్నసమారాధనలు భారీగా జరిగాయి. జీవీఎంసీ భీమిలి జోన్ ఆదర్శనగర్, సంతపేట, భీమిలి మండలం చిప్పాడ, ఆనందపురం మండలం బోయిపాలెం, వేములవలస గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, అన్నప్రసాదాలు స్వీకరించారు.



చిప్పాడలో గరిక , కరెన్సీ అలంకరణలో గణపతి


- చిప్పాడలో గణపతిని ప్రత్యేకంగా గరిక, కరెన్సీ నోట్లతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర సందర్శించి, అన్నదానంలో పాల్గొన్నారు. 1,2 వార్డుల నాయకులు శిల్లా కరుణాకరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, చిల్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.
- విల్సన్‌పేట మండపాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, శిష్టకరణాల రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, పందిరి విజయ్ తదితరులు సందర్శించారు.
- భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, అమనాం పంచాయతీలలో బొడ్డు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం మండలం పాలవలసలో జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



సంతపేటలోని మండపంలో గణపతి సన్నిధిలో సిరి సహస్ర



విల్సన్‌పేట మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆనందపురం మండలం పాలవలసలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి

జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డైట్ అధ్యాపకులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌ను డైట్ అధ్యాపకులు కె.శోభారాణి, వి.వసుంధర, ఎం.వెంకటరమణ, కె.శాంతి బుధవారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ముఖ్యంగా 6వ తరగతి విద్యార్థుల 40 రోజుల కార్యక్రమంలో భాగంగా వారి రాత పుస్తకాలు తీసుకుని ఉపాధ్యాయుడు ఎలా దిద్దారో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల డైరీలతో పాటు అకడమిక్ కేలండర్ ప్రకారం సిలబస్ అయిందా లేదా అనేది చూశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన ప్రధానోపాధ్యాయుడు డి.సత్యారావు, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, రేఖ అప్పారావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ముంపులో సబ్బివానిపేట,ఆదర్శనగర్



సబ్బివానిపేట సర్వీస్‌రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో స్తంభించిన రాకపోకలు



సబ్బివానిపేట సర్వీస్‌రోడ్డుపై నిలిచిన నీరు

తగరపువలస: భీమిలిలో బుధవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి జీవీఎంసీ రెండోవార్డు సబ్బివానిపేట, ఆదర్శనగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వర్షంనీరు సర్వీస్ రోడ్డుపై నిలిచిపోవడంతో తగరపువలస, విశాఖ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గంట తరువాత వర్షపు నీరు పక్కనున్న డ్రైనేజీ నుంచి ప్రవహించడంతో రహదారిపై నీరు తగ్గి వాహనాల రాకపోకలు సాగాయి.

చెరువులను తలపిస్తూ.. : ఆదర్శనగర్, టీచర్స్ కాలనీలలోనూ రహదారిపై వర్షంనీరు నిలిచిపోయింది. డ్రైనేజీలు పొంగి పొరలి అంబేద్కర్ కూడలి మీదుగా ప్రవహించడంతో లోపలి నుంచి చెత్త, పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రధానరహదారిపై చేరి నిలిచిపోయాయి. ప్రైవేట్ మార్కెట్ నుంచి కూడా చేపలు, మాంసం వ్యర్థాలు సంతబయలు, ప్రధాన రహదారిపై చేరుకున్నాయి. సంగివలస అనిట్స్ కళాశాల రహదారి, నమ్మివానిపేట–ఆదర్శనగర్ రహదారి, సంగివలస–పాండ్రంగి రహదారిపై గోతుల కారణంగా వర్షంనీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షం కురిసిన ప్రతీసారి ఇబ్బందులు తప్పడం లేదని భీమిలి ప్రజలు నిట్టూరుస్తున్నారు.



తగరపువలస- విశాఖ రహదారిపై నిలిచిన వాహనాలు



ఆదర్శనగర్ రహదారిపై నిలిచిన వాన నీరు

శరన్నరాత్రి ఉత్సవాలకు రాట



ఉత్సవరాటకు పసుపు పూస్తున్న మహిళలు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి బుధవారం నిర్వాహకులు రాట వేశారు. ఇక్కడ 12 అడుగుల అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి, తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, రంగూరి సీతారామదొర తదితరులు పాల్గొన్నారు.

వరికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పద్మనాభం: వరి పిలకలు పెట్టే దశలో ఉన్నందున సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఎలమంచిలి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి సూచించారు. మండలంలోని బాందేవపురం, పద్మనాభం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎకరాకు 25కిలోల యూరియా వేయాలన్నారు. పొటాషియం లోపిస్తే 15 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. ఆమె వెంట ఏవో ఎంపీఎస్ చలం, వీఏ దిలీప్ ఉన్నారు.



పద్మనాభంలో నిర్వహిస్తున్న పొలం బడి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాకలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, ప్రభుత్వ పథకాలు, బీమా, రీ కేవైసీ తదితర అంశాల గురించి ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్ తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ రీజినల్ మేనేజర్ సింహాచలం, కెనరా బ్యాంకు రీజినల్ హెడ్ ఎస్.మధుసూదనరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏపీజీవీ రీజినల్ హెడ్ చిరంజీవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, చందక సర్పంచ్ బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలకు కేజీబీవీ విద్యార్థినుల ఎంపిక



సర్టిఫికెట్ పరీక్షలకు ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులు

పద్మనాభం: మండల పరిధి కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయానికి చెందిన 22 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఏ సర్టిఫికెట్ పరీక్షలకు ఎంపికయ్యారు. విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ విశ్వకర్మలో గత నెల 24 నుంచి సెప్టెంబర్ రెండు వరకు జరిగిన కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో ప్రతిభ చూపిన వీరు ఈ పరీక్షలకు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. వీరిని డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్, ఎస్ఎస్ఏ ఏపీసీ జె.చంద్రశేఖరరావు, జీసీడీవో శ్రీదేవి, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ అభినందించారు.